



పేలుడు ధాటికి నేలమట్టమైన నాగేశ్వరరావు ఇల్లు

అమలాపురం పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు కూతవేటు దూరంలో వున్న రావులచెరువులో సోమవారం ఉదయం 9.45 గంటల సమయంలో ఓ ఇంట్లోంచి భారీ శబ్దం వచ్చింది. బాణసంచా తయారు చేస్తున్న ఇల్లు పేలుడు ధాటికి తునాతునకలై కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ప్రాణాలతో బతికి బయటపడ్డారు. పక్కనే ఉన్న మరో ఇల్లు కూడా ధ్వంసమైంది. సమీపంలోని నివాస గృహాలకూ నష్టం వాటిల్లింది. సుమారు కిలోమీటరు మేర పెద్ద శబ్దం వినిపించడంతో ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. విస్ఫోటనంలో గొవ్వాల నాగేశ్వరరావు, గొవ్వాల సుభద్రమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా ధ్వంసమైనట్టు రెవెన్యూ అధికారులు రికార్డు చేశారు. వాటితో పాటు సమీపంలోని పలు ఇళ్లు స్వల్పంగా డామేజీ అయ్యాయి. పలుచోట్ల టీవీలు ధ్వంసమయ్యాయని రికార్డు చేశారు.

ఉలికిపాటు



ధ్వంసమైన గొవ్వాల సుభద్రమ్మ ఇల్లు

ఈ ఘటనలో మొత్తం 17 మంది గాయపడగా.... తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాణసంచా తయారు చేస్తున్న గొవ్వాల నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా వుంది. ఆయన భార్య నాగలక్ష్మి (55) తలకు బలమైన గాయం కావడంతో మంగళవారం ఉదయం శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్టు వైద్యులు తెలిపారు.

వివరాలు 7, మెయిన్‌లో



ప్రమాద ఘటనలో సంచులతో ఉన్న పేలుడు సామగ్రి సూరేకారం

విస్ఫోటనం జరిగిన రావులచెరువు జిల్లా కేంద్ర కార్యాలయాలకు అత్యంత సమీపంలోనే ఉంది. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఈ ప్రమాదం సంభవించడంతో అధికారులంతా కలవరపాటుకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని బాణసంచా పేలుడు వల్లే ఈ ఘటన జరిగినట్టు భావిస్తున్నామన్నారు. ఎస్పీ కృష్ణారావు సంఘటనా స్థలాన్ని సందర్శించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య బాణసంచా తయారీ చేస్తుంటే ఆ సమాచారాన్ని అధికారులకు తెలియచేస్తే ఈ తరహా ప్రమాదాలు ఉత్పన్నం కావని పోలీసు, రెవెన్యూ అధికారులు స్థానికులకు స్పష్టం చేశారు. ఘటనా స్థలాన్ని ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సీఐ వీరబాబు, పాటు పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ సహా వివిధ శాఖల అధికారులు, క్లూస్ టీమ్ సభ్యులు చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్‌టీమ్ సిబ్బంది విస్ఫోటనానికి దారితీసిన పరిస్థితులపై స్థానికులను ఆరా తీయడంతో పాటు క్లూస్ సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

అమలాపురం రావులచెరువులో బాణసంచా తయారు చేస్తున్న
ఇంట్లో భారీ విస్ఫోటనం

9 మందికి తీవ్ర గాయాలు... ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడ్డ తల్లీబిడ్డ కట్టా వేణు, వెంకట్



తీవ్రంగా గాయపడ్డ గొవ్వాల యల్లీష్‌రాజు, మోహనప్రియ



చికిత్స పొందుతున్న పితాని శాంతి

బాధితులకు పరామర్శ



ఏరియా ఆసుపత్రిలో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: రావులచెరువులో సోమవారం ఉదయం జరిగిన బాణసంచా విస్ఫోటనం బాధితులను పలు పార్టీల నాయకులు పరామర్శించారు. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. బాధితులను ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు ఉన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఏరియా, కిమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బాధితులను పరామర్శించారు. వారి వెంట నాయకులు ఆర్వీ నాయుడు, అడపా శ్రీనివాసరావు, కొండేటి ఈశ్వర్ గౌడ్ ఉన్నారు. వైసీపీ నాయకులు శెట్టిబత్తుల రాజబాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావుతో పాటు పలువురు బాధితులను పరామర్శించి ఓదార్చారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంద్ర మాల్యాద్రి, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు గుదే దుర్గాప్రసాద్, మోహనరావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి క్షతగాత్రులకు రూ.10లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



గాయపడ్డ బాలికను పరామర్శిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

కలకలం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకైన వాసన అమలాపురం పట్టణ ప్రజలను ఊపిరి పీల్చుకోకుండా చేసింది. ఆ వాసన అంతకంతకూ పెరుగుతుండడంతో ఎక్కడ ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో పట్టణ సీఐ పి.వీరబాబుతో పాటు రెవెన్యూ అధికారులకు ఆయా ప్రాంతాల ప్రజలు సమాచారం అందించారు. ఎక్కడైనా గ్యాస్ పైపులు లీకయ్యాయేమోనని ఆందోళన చెందారు. ప్రధానంగా అమలాపురం మార్కెట్ సెంటర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, సినిమారోడ్డు, మెయిన్‌రోడ్డు, ఈదరపల్లి శివాలయం రోడ్డు, హైస్కూలు సెంటర్, కళాశాల రోడ్డు ప్రాంతాల్లో ఆ వాసన ఎక్కువగా రావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆరా తీశారు. పట్టణంలో అసలు గ్యాస్ పైపులైన్లు ఎటువైపు నుంచి ఎక్కడకు వెళుతున్నాయన్న అంశంపై చర్చలు జరిపారు. పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఉదయం 7 గంటల వరకు అదే వాసన. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో గడిపిన పట్టణ ప్రజలకు ఆ తర్వాత వాసన క్రమేపీ తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

గుంటూరు జట్టుకు ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్
సీనియర్ స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా యశ్వంత్... 7లో

మహ్మద్ ప్రవక్త జయంతిని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన జీవిత చరిత్రను ఖురాన్‌లో పేర్కొన్నట్టు వివరించారు. అంబాజీపేటలోని అంజుమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలను కింది చిత్రంలో చూడొచ్చు.... 8లో



అంబాజీపేటలో పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను ఉపాధ్యాయులకు అందిస్తున్న వైద్యాధికారి, ప్రజాప్రతినిధులు

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

నేడు జాతీయ నులి పురుగుల దినోత్సవం
జిల్లాలో 3.04 లక్షల మందికి మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

అంబాజీపేట, సెప్టెంబరు 16: రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించాలన్న లక్ష్యంతో నీతి అయోగ్ రూపొందించిన జాతీయ పోషకాహార విధానంలో భాగంగా జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నారు. నెలల వయసు చిన్నారి నుంచి వృద్ధుల వరకు నులిపురుగులు ఇబ్బందిపెడుతుంటాయి. పొట్టలోకి సులువుగా చేరి హాని కలిగిస్తాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఏటా రెండుసార్లు నులిపురుగుల నివారణ కోసం మాత్రలను ఇస్తుంటారు. రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు.

నులి పురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో 1,720 అంగన్‌వాడీ కేంద్రాలలోని 61,528 మందికి, అన్ రిజిస్టర్డ్ పిల్లలు 1215 మందికి, 253 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 66,126 మందికి, 373 ప్రైవేటు పాఠశాలకు సంబంధించి 1,00,926 మందికి, ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు సంబంధించి... మొత్తంగా 3,04,318 మందికి 3812 కేంద్రాల ద్వారా డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తారు. ఇందుకు ఆయా గ్రామాల పరిధిలోని 523 మంది ఏఎన్ఎంలు, 1383 మంది ఆశా వర్కర్లను డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఆదేశాల మేరకు నియమించినట్టు ప్రోగ్రాం అధికారి డాక్టర్ జాన్‌లివి ఇంజేటి తెలిపారు.

కంటికి కనిపించినంత పరిమాణంలో ఉండే నులి పురుగులు మనం తీసుకునే ఆహారం ద్వారానే పొట్టలోకి చేరతాయి. తీపి పదార్థాలు, జంక్‌ఫుడ్ తినే వారిలోను, కలుషిత నీరు తీసుకోవడం, జీర్ణక్రియ సక్రమంగా లేకపోవడంతో నులి పురుగులు వచ్చే అవకాశం ఉంది. పిల్లలు మట్టిలో ఆడుకుంటే చేతుల్లో చేరిపోతాయి. చేతులను శుభ్రం చేసుకోకపోతే పొట్టలోకి చేరి అభివృద్ధి చెందుతాయి. దీంతో బక్కచిక్కపోతారు. రక్తహీనతతో బాధపడతారు. ఎంత తిన్నా బరువు పెరగరు. అందుకే పిల్లలు వీలైనంత ఎక్కువగా పీచు పదార్థాలు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నులి పురుగులు ఉంటే రక్తహీనత వస్తుంది. శరీరం తెల్లగా పాలిపోతుంది. చేతులు, కాళ్లలో విపరీతమైన దురద వస్తుంది. దేహంపై ఎక్కడైనా చర్మం మీద అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. మనిషి బాగా నీరసించిపోవడం, నిస్సహాయంగా ఉండడం, ఉత్సాహం, సంతోషం సన్నగిల్లడం, కళ్లు తిరిగి పడిపోవడం వంటి జరుగుతాయి. నులిపురుగులు వ్యాపించిన వారు నివారణ చర్యలు చేపట్టాలి. భోజనానికి ముందు, తర్వాత చేతులను పరిశుభ్రం చేసుకోవాలి. బహిరంగ మల విసర్జనకు వెళ్లకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి. తీసుకునే ఆహారంలోనూ జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులి పురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలి. వయసులో ఉన్నవారైతే వరుసగా మూడు రోజులు మూడు మాత్రలు చొప్పున వేసుకోవాలి. మింగకుండా చప్పరించాలి.

జిల్లాలో మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లాలోని 46 పీహెచ్‌సీలు, 7 అప్పర్ పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 19ఏళ్లలోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాము. పాఠశాలలకు వెళ్లి ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్ల ద్వారా పంపిణీ చేస్తాము. ఈ మాత్రలను మూడు రోజుల పాటు జిల్లాలో ఉన్న 3,04,318 మందికి సిబ్బంది పంపిణీ చేస్తారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ (200 మి.గ్రా.) మాత్ర సగం మాత్రమే పొడి చేసి నీటిలో కలిపి ఇవ్వాలి. 2 నుంచి 19 సంవత్సరాలకు (400 మి.గ్రా.) మాత్ర. పిల్లలు చప్పరించి నమిలి నీటితో పాటు మింగాలి.

డాక్టర్ జాన్‌లివి ఇంజేటి, ప్రోగ్రాం అధికారి, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ, అమలాపురం



తేనెటీగల దాడిలో గాయపడిన చిన్నారులకు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

వినాయక నిమజ్జనంలో అపశృతి

మగటపల్లిలో తేనెటీగల దాడి... 23 మందికి గాయాలు

మామిడికుదురు, సెప్టెంబరు 16: మండలంలోని మగటపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో హైస్కూలు రోడ్డులో ఓ భక్తుడు తారాజువ్వ వేయడంతో ఆ శబ్దానికి తేనెటీగలు భక్తులపై దాడి చేశాయి. 23 మందికి గాయాలయ్యాయి. వీరిలో 16 మంది చిన్నారులు రాజోలు ప్రభుత్వాసుపత్రిలోను, ఇద్దరు అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలోను చికిత్స తీసుకుంటున్నారు. మిగిలిన ఐదుగురు పెద్దలు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంకా పలువురికి గాయాలయ్యాయని... వారు స్థానికంగానే చికిత్స తీసుకుంటున్నట్టు సమాచారం.

పిచ్చి కుక్క స్వైరవిహారం...

మగటపల్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. ముందుగా గ్రామంలోని రెండు ఆవులను కరవగా స్థానికులు దానికోసం వెంబడించగా పరారైంది. మరలా తిరిగి గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఎనిమిది మందిని కరవగా... వారిలో నలుగురు రాజోలు ప్రభుత్వాసుపత్రిలోను, మరొక నలుగురు నగరం పీహెచ్‌సీలోను చికిత్స తీసుకున్నారు. స్వైరవిహారం చేసిన పిచ్చి కుక్కను స్థానికులు గాలించి కొట్టి చంపారు.



చవితి పందిళ్లలో తొమ్మిది రోజులు పూజలు చేసిన గణనాథులకు భక్తులు అంతే భక్తి శ్రద్ధలతో వీడ్కోలు పలికారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన గణనాథులను వాహనాలపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. బాణసంచా, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు గణేష్ మహరాజ్ కీ జై అంటూ నినాదాలు చేస్తూ... పరస్పరం రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. రాజోలు వద్ద వశిష్ట గోదావరిలో గణనాథుని నిమజ్జన దృశ్యమిది.... వార్తలు 8లో



బాధసంచా..

సమయం : సోమవారం
ఉదయం 9.45 గంటలు..
అమలాపురం పట్టణంలోని 30వ వార్డు పరిధి రావులచెరువులో బాణసంచా తయారీదారుడు గొవ్వల నాగేశ్వరరావు నివాసం..
అందరూ ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు.. ఒక్కసారిగా భయంకరమైన శబ్దంతో పేలుడు.. మంటలు.. దట్టమైన పొగ.. ఏం జరిగిందోనని అంతా అలజడి.. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు, గోడలు కుప్పకూలాయి.. ఇంట్లో ఉన్న వారందరూ బయటకు పరుగులు పెట్టి ప్రాణాలు కాపాడుకోగా.. మోటారు సైకిళ్లు గాలిలోకి ఎగిరి రోడ్డున పడ్డాయి. రోడ్డుపై వెళ్లే వారికి.. చుట్టుపక్కల ఉన్న వారికి కూడా గాయాలయ్యాయి.. మొత్తం 17 మందికి గాయాలు కాగా.. అందులో తొమ్మిది మంది తీవ్రం గాయపడ్డారు. ఈ ఘటనతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉలిక్కిపడింది.


పేలుడు ధాటికి ధ్వంసమైన గొవ్వాల సుభద్రమ్మకు చెందిన డాబా గోడ



తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన నాగేశ్వరరావు, నాగలక్ష్మి

- ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు
- కుప్పకూలిన ఇల్లు, గాల్లోకి ఎగిరిన మోటారు సైకిళ్లు
- మొత్తం 17 మందికి గాయాలు
- 9 మందికి తీవ్ర గాయాలు.., ఇద్దరి పరిస్థితి విషమం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- గ్యాస్ లీక్ వల్లే పేలుడు : మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీదారుడైన గొవ్వల నాగేశ్వరరావు(62) కొంత కాలంగా ఇంట్లోనే బాణసంచా తయారుచేస్తూ విక్రయాలు చేస్తున్నాడు. నివాస గృహాల మధ్య తయారుచేయడం ప్రమాదకరమని చుట్టుపక్కల వారంతా రెండు, మూడు పర్యాయాలు అతడికి చెప్పినావారి మాటలను లక్ష్య పెట్టలేదు. సోమవారం ఉదయం గ్యాస్ లీకై బాణసంచా సామగ్రి అంటుకుని విస్ఫోటం సంభవించినట్టు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. ఇక్కడ వద్దని వారించినా వినకుండా తయారు చేయడం వల్లే ఈ ఘోరం జరిగిందని చుట్టుపక్కల వారు పోలీసు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు చెందిన భవనం పూర్తిగా కుప్పకూలింది. పక్కనే నివాసమున్న గొవ్వాల సుభద్రమ్మ ఇంటి గోడ పూర్తిగా ధ్వంసమైంది. అయితే సుభద్రమ్మ అంతకు ముందే పొలం వద్దకు వెళ్లడంతో బతికి బయటపడింది. పక్కింట్లో దుస్తులు ఉతుక్కుంటున్న దూనబోయిన సుబ్బలక్ష్మికి గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్లేవారు, దగ్గరలో ఆడుకుంటున్న పిల్లలకి కూడా శకలాలు తగలడంతో గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇంట్లో గ్యాస్ లీకై బాణసంచా పేలుడు సంభవించిందని కొందరు, బాణసంచా తయారు చేస్తున్న సమయంలోనే ఈ పేలుడు సంభవించి నల్లని పొగ ఆకాశంలోకి ఎగిసి పడడంతో ఆ ప్రాంత ప్రజలందరూ అయోమయానికి గురయ్యారనేది మరికొందరి ఆరోపణ.

క్షతగాత్రులు వీరే..

బాణసంచా విస్ఫోటంలో గొవ్వాల నాగేశ్వరరావు (62), నాగలక్ష్మి(55)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి కుమారుడు గొవ్వాల యల్లీష్‌రాజు (25), యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు (35), మనుమడు వెంకట్, పక్కపక్క ఇళ్లకు చెందిన చొల్లంగి మారుతిసుబ్రహ్మణ్యం (20), పితాని శాంతి(26), బొక్కా మోహనప్రియ (11), దూనబోయిన సుబ్బలక్ష్మి (45), బొక్కా గీత గాయాలపాలయ్యారు. వీరందరూ కిమ్స్, అమలాపురం ఏరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బొక్కా మల్లి (12), పాటి దేవి (23), దూనబోయిన గాయత్రి(20), పాటి ప్రకాష్ (26), పాటి సుజాత(40), పాటి ప్రభాకరం(45)లకు స్వల్ప గాయాలు కాగా వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించి ఇళ్లకు పంపేశారు.


రావులచెరువులో పేలుడు ధాటికి పూర్తిగా నేలమట్టమైన నాగేశ్వరరావు ఇల్లు

గ్యాస్ లీక్‌తో బాణసంచా పేలుడు : మంత్రి సుభాష్

రావులచెరువులో గ్యాస్ సిలిండర్ లీకవ్వడంతోనే బాణసంచా పేలుడు సంభవించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పేలుడులో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన తర్వాత ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు. దేవుడి దయ వల్ల ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేసేవారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రశాంత కోనసీమలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరం. తక్కువ మోతాదుతో బాణసంచా తయారు చేసినా గ్యాస్ సిలిండర్ల ప్రభావం వల్ల భవనం నేలమట్టం అయ్యింది. ఆ చుట్టుపక్కల 150 మీటర్ల దూరం వరకు భవనాలు, అద్దాలు దెబ్బతిన్నాయి. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు వైద్య ఖర్చులు, ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఎక్కడైనా ఇళ్ల మధ్య బాణసంచా తయారుచేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని అధికారులను కోరారు. మంత్రి వెంట పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.


పేలుడు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

నలుగురు మైనర్ల అరెస్టు

10 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కడియం, సెప్టెంబరు 16: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారిని రాజమహేంద్రవరం కోర్టుకు హాజరుపరుస్తున్నట్టు డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సోమవారం కడియం పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలు మీడియాకు వెల్లడించారు. కడియం మండలంలో ఇటీవల జరుగుతున్న మోటారు సైకిళ్ల వరుస దొంగతనాలపై ప్రత్యేక పోలీసుబృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ నాగదుర్గాప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు చైతన్యనగర్ శివారు దాండుబాబు ఆలయం వద్దకు పోలీసుసిబ్బందితో వెళ్లగా నలుగురు మైనర్లు మోటారు సైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని విచారించారు. ద్విచక్ర వాహన పత్రాలు పరిశీలించగా.. అవి చోరీకి గురైన మోటారుసైకిళ్లుగా వాటిని గుర్తించి, వారిని కడియం పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. పందలపాక, మామిడాడ గ్రామాలకు చెందిన కొంతమందితో బృందంగా ఏర్పడి కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పరిధిలో 10 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్టుగా గుర్తించామని వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. పోలీసుసిబ్బంది కె.సురేష్‌బాబు, ఎం.సురేష్‌కుమార్, జి.రవికుమార్, కేవీ లక్ష్మణ్, శివకృష్ణ, బీమారావు, వై.రాహుల్, యూ.నాగబాబుకుమార్‌లు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సత్య గృహోపకరణాల షోరూం ప్రారంభం

అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు


షోరూం ప్రారంభించిన దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16: సత్య ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వారి గృహోపకరణాలు షోరూం కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎండీ జీఎం జాన్సన్ ఆన్ స్రీయా, జీఎం సెంథిల్ కుమార్, ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యా అంటే సంతోషమని, కస్టమర్లకు నాణ్యమైన వస్తువు సరసమైన ధరలకు అందించి కస్టమర్లకు సంతోషాన్ని, నమ్మకాన్ని అందించడం సత్య సొంతమన్నారు. ప్రొడక్ట్ హెడ్ భరత్ మాట్లాడుతూ 34వ షోరూంను కాకినాడలో ప్రారంభించామన్నారు. దేశవ్యాప్తంగా 277 షోరూమ్‌లు ఉన్నాయని, రాష్ట్రంలో 34 షోరూమ్‌లు ఉన్నాయని అన్నారు. రూ.30వేల పైబడి కొనుగోలు చేసిన వారికి బంగారు కాయిన్ ఇస్తామన్నారు.

విద్యార్థినులతో గుంజీలు తీయించిన ప్రిన్సిపాల్

- 50 మంది గిరిజన గురుకుల విద్యార్థినులకు అస్వస్థత
- రంపచోడవరం గురుకుల కళాశాలలో ఘటన
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ

రంపచోడవరం, సెప్టెంబరు1: రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు సుమారు 50 మంది సోమవారం అస్వస్థతకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేరారు. కళాశాల ప్రిన్సిపాల్ క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులతో పెద్ద ఎత్తున గుంజీలు తీయించడంతో వారందరూ అస్వస్థతకు గురయ్యారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాలకు చేరుకొని అనారోగ్య కారణాలపై ఆరా తీయగా ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని తెలిసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి లోతారామారావు, నాయకులు మట్ల వాణిశ్రీ తదితరులు గురుకుల కళాశాలకు చేరుకుని అస్వస్థతకు గురైన విద్యార్థినులను అంబులెన్సులో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటన గురించి తెలుసుకున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కూడా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. తర్వాత గురుకుల కళాశాలను కూడా పరిశీలించి అక్కడ విద్యార్థినులతో మాట్లాడారు.

వినాయకా.. వీడ్కోలికా..

గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఊరూరా.. వీధి వీధినా కొలువుదీర్చిన బొజ్జగణపయ్యలకు భక్తులు ఘన వీడ్కోలు పలికారు.. వెళ్లిరా వినాయకా అంటూ సాగనంపారు. తీన్‌మార్ డప్పుల మోత మధ్య ఘనంగా నదీ, సముద్రతీరాలు, కాలువల వద్దకు తీసుకువెళ్లారు. నిమజ్జన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.
- కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో గణనాథుడిని రథంపై నిమజ్జనానికి తీసుకువెళుతున్న చిన్నారులు


కాకినాడలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు


రాజమహేంద్రవరం గోదారి గట్టు వద్ద వినాయక విగ్రహాలు


వినాయక నిమజ్జనాల వద్ద మహిళల నృత్యాలు


గోదావరి తీరాన గంగమ్మ ఒడిలోకి గణపయ్య..

చిక్కని చిరుత జాడ..

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 : చిరుతపులి కదలికల జాడ సోమవారం ఎటువంటి సీసీ, ట్రాప్ కెమెరాల్లోనూ కనిపించలేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిరుతను ట్రాప్‌బోనులలో పట్టుకొనుటకు అదనపు బోనులను అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, ప్రస్తుతం నివాసప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ లేదని తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పిల్లలను సాయంత్రం ఆరు గంటలు దాటాక బయట తిరగకుండా చూడాలని తల్లిదండ్రులకు మరోసారి విజ్ఞప్తి చేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..

- ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ గుంటూరు జట్టు
- సీనియర్ స్ట్రాంగ్ మెన్‌గా యశ్వంత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యెనుముల కృష్ణపద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో గుంటూరు జట్టు ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. హోరాహోరీగా సాగిన పవన్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో స్ట్రాంగ్‌మెన్ టైటిల్ విన్నర్స్‌గా పి.జాన్‌బాబు (కృష్ణ), బి.యశ్వంత్‌కుమార్ (కోనసీమ), పి.దినేష్ (అనకాపల్లి) వరుస స్థానాలు సాధించారు. జూనియర్ మెన్ విభాగంలో ఎన్.శరత్ (పల్నాడు), ఎస్.బాలసాయిచరణ్ (అనకాపల్లి), జె.లవకుమార్ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా కె.యశ్వంత్ (విశాఖ) నిలవగా కేవీవీఎస్పీ ప్రసాద్ (అనకాపల్లి) ద్వితీయ, ఎన్.శరత్ (పల్నాడు) తృతీయ స్థానాలు సాధించారు. మెన్స్ విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పోటీల విజేతల వివరాలతో పాటు టీమ్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను బాలాజీ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, యేడిద శ్రీను, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వంటెద్దు బాబి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నందెపు బాలాజీ


స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా నిలిచిన యశ్వంత్

మనస్పర్థలొద్దు.. మనందరం ఒకటే

- కూటమి ఐక్యతను దెబ్బతీసే పనిలో దుష్టశక్తులు
- కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులతో మంత్రి వాసంశెట్టి సుభాష్


మంత్రి సుభాష్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16: మనస్పర్థలు వద్దు.. మనందరం ఒకటేనని, కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని దుష్టశక్తులు పని చేస్తున్నాయని, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అహర్నిశలు పాటుపడుతున్నారని, వారి స్ఫూర్తితోనే అందరూ కలసికట్టుగా కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతుల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పిల్లి దంపతులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సుభాష్ మాట్లాడారు. అనంతరం మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీలో అత్యంత సీనియర్ నాయకులు పిల్లి దంపతులని, పార్టీ పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థి గెలుపు కోసం విశేష కృషి చేశారన్నారు. పార్టీ కష్టకాలంలో టీడీపీ వెన్నంటే ఉన్న చరిత్ర పిల్లి దంపతులదని కొనియాడారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు తెలిసిందని, వీటిని పరిష్కరించేందుకు ఇక్కడికి వచ్చానని, ముందుగా పిల్లి దంపతులతో మాట్లాడానని వెల్లడించారు. కూటమి ఎమ్మెల్యే పంతం నానాజీ అందుబాటులో లేకపోవడంతో మరోసారి వచ్చి ఆయనతో మాట్లాడతానని తెలిపారు. కూటమి ఐక్యతను దెబ్బతీసే విధంగా కొంత మంది ప్రత్యర్థులు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. తనకు ఎమ్మెల్యే పంతం నానాజీకి మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులతో కలసి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంపర ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, మాజీ జడ్పీటీసీ బుంగాసింహాద్రి, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు పలివెల త్రిమూర్తులు, పాలిక ఉషారాణి, మాతా లక్ష్మణ్, తాతపూడి రామకృష్ణ, చొక్కా జగన్, పితాని అప్పన్న, మరుకుర్తి నాగబాబు, పిల్లి బుజ్జి, పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- గిరిజన సంక్షేమ వసతిగృహంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపించి సరిపెట్టిన వైనం
- గంగవరం ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఘటనపై ఆందోళనకు సిద్ధమవుతున్న గిరిజన సంఘాలు

రంపచోడవరం, సెప్టెంబర్16: అల్లూరి జిల్లా గంగవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు అనుబంధంగా నడుస్తోన్న వసతిగృహంలో ఉంటున్న గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులపై ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ప్రధానోపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలతో పాటు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరం కింద కేసు నమోదు చేయించడం మానేసి కేవలం డిప్యుటేషన్‌పై మంగంపాడు బాలికల ఆశ్రమ పాఠశాలకు పంపించి అధికారులు చేతులు దులిపేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులకు వేరే ప్రత్యేక వసతిగృహం లేకపోవడంతో గంగవరంలోని ఆశ్రమపాఠశాల వసతి గృహంలోనే వీరికి వసతి కల్పించారు. దీంతో 10వ తరగతి విద్యార్థినులను పాఠశాల అయ్యాక చదివించే వంకతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా బాలికల వసతిగృహంలోకి ప్రవేశించి అక్కడే ఉంటున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులపై కన్నేశాడు. వారి వద్దకు చేరి వారి పక్కనే కూర్చొని, వారిని లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. తొలుత ఆయనను ప్రతిఘటించి వ్యతిరేకించిన విద్యార్థినులు తనకు సహకరించకపోతే ఇక్కడ వసతి ఉండదన్న హెచ్చరికలతో ఆయన వేధింపులను విద్యార్థినులు భరిస్తూ వచ్చారు. కొంతకాలానికి వారిలో ధైర్యం వచ్చి తమపై జరుగుతున్న వేధింపులను వారి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వివరించారు. ఆయన తక్షణం స్పందించి స్థానికంగా ఉన్న తహశీల్దారు, ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఐటీడీఏ అధికారులు గంగవరం తహశీల్దారు నుంచి వాస్తవాలను గ్రహించారు. తహశీల్దారు ప్రాథమిక విచారణలో విద్యార్థినులు మొత్తం విషయాలను వివరించారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఓ ప్రధానోపాధ్యాయుడు వసతి గృహంలోని ఇంటర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఆయనను కేవలం డిప్యుటేషన్‌పై పంపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో పలు గిరిజన సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

వెంకన్న ఆదాయం రూ.3.82లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు16: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.3,82,850 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పెంటా వెంకట్రావు-మణికుమారి దంపతులు రూ.50వేలు విరాళం సమర్పించారు. మంగళవారం నుంచి అక్టోబరు వరకు ఆలయంలో స్వచ్ఛహి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనరు కిషోర్‌కుమార్ తెలిపారు.

● బై బై గణేశా.. అంటూ యువత నినాదాలు
● బుట్టబొమ్మల వేషధారణ, డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గణనాథుల ఊరేగింపు

వైభవంగా గణనాథుల నిమజ్జనాలు






రాయవరం వెదురుపాకలో గణనాథుడి ఊరేగింపు దృశ్యం, కపిలేశ్వరపురం, అంతర్వేది, పి.గన్నవరం మండలం నాగుల్లంకలలో గణనాథుల నిమజ్జనాల దృశ్యాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 16: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ముగింపు సందర్భంగా మండలంలోని పలుచోట్ల సోమవారం గణపతి ఉత్సవ విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి భారీ బాణసంచా కాల్పులు, బుట్టబొమ్మల వేషధారణ, డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా గౌతమీ గోదావరి వద్దకు తీసుకువెళ్లి పవిత్ర నదీ జలాల్లో నిమజ్జనం చేశారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్ సెంటర్‌లోని లక్ష్మీగణపతి, రాయుడువారిపాలెం, టీటీఆర్ నగర్, మట్టాడిపాలెం, మండలంలోని పలు గ్రామాల నుంచి గణపతి ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పి.గన్నవరం: మండలంలో సోమవారం గణేషుని నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. లంకలగన్నవరం లాకు వద్ద వేంచేసిఉన్న వినాయకుడిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి స్థానిక వైనతేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. పి.గన్నవరం ఆటో యూనియన్, శివాలయం వీధి, నాగుల్లంక లారీ యూనియన్, మండలంలోని మొండెపులంక, మానేపల్లి, రాజులపాలెం, ముంగండ, కె.ముంజవరం, కె.ఏనుగుపల్లి, నరేంద్రపురం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణపతి మందిరాల్లో వినాయకుడు విగ్రహాలను గ్రామాల పురవీధుల్లో ఊరేగించి స్థానిక గోదావరి నదీ పాయల్లో నిమజ్జనాలు చేశారు.

మామిడికుదురు: మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, బి.దొడ్డవరం తదితర గ్రామాల్లోని విగ్రహాలను బాణసంచా కాల్పులు, మేళతాళాలు, కోలాట భజనల నడుమ ఘనంగా ఊరేగిస్తూ వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక సపోటా సెంటర్‌లో లక్ష్మీగణపతి మండపం వద్ద బుట్ట బొమ్మలు, వాయిద్యాల నడుమ వినాయకుడ్ని ట్రాక్టర్ ట్రాలీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాయవరం, మాచవరం, పసలపూడి, వెంటూరు, చెల్లూరు, సోమేశ్వరం, లొల్ల, వి.సావరం, కుర్మాపురం, కురకాళ్లపల్లి, నదురుబాద గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

మలికిపురం: మలికిపురం మండలంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం ప్రతీ గ్రామం నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనం కోసం రాజోలు, టేకిశెట్టిపాలెం తీసుకువెళ్లారు. విగ్రహాలను బాజభజంత్రీలతో పాటు భారీగా బాణసంచా కాల్చుతూ స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నదీపాయల్లో నిమజ్జనం చేశారు.

అంతర్వేది: టేకిశెట్టిపాలెం బాడిరేవు వంతెన వద్ద 17ఏళ్లుగా నిమజ్జన మహోత్సవాలు రేకపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు వివిధ గ్రామాల నుంచి తీసుకువచ్చిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉత్సాహంగా విగ్రహాలను క్రేన్ సాయంతో గోదావరి పాయలో నిమజ్జనం చేశారు. ప్రమాదాలు జరగకుండా భక్తులకు జల్లుస్నానం ఏర్పాటు చేశారు. వీవీమెరక, అంతర్వేదిపాలెం, మోరి, శృంగవరప్పాడు, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వారి మండపాల వద్ద నుంచి తీన్మార్ డప్పులతో బాణసంచా కాల్పుల నడుమ వినాయక విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనాలు చేశారు. నిమజ్జనాల వద్ద భక్తులకు ప్రసాదం, భోజనం ఏర్పాట్లను నరసింహారావు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లింగోలు పెద్దబ్బులు, సర్పంచ్ దేవిదుర్గాతాతయ్యనాయుడు, ఎంపీటీసీ లింగోలు చిన్నబ్బులు, ఉపసర్పంచ్ కటికిరెడ్డి మహేష్, బీజేపీ నాయకులు మాలే శ్రీనివాసనగేష్, మాజీ సర్పంచ్ గెడ్డం పేద్రాజు, మోరం నాయుడు, స్థానియ యూత్ పాల్గొన్నారు.

ఆలమూరు: గణపతి నవరాత్రులు ముగియడంతో సోమవారం మండలంలో గణేశ నిమజ్జనాలు నిర్వహించారు. వాడవాడలా ఏర్పాటుచేసిన గణేశ ప్రతిమలను భారీ ఎత్తున ఊరేగించి వాటిని కాలువలు, గోదావరిలో నిమజ్జనం చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణం, మండలంలో సోమవారం గణనాథుల నిమజ్జనాలు నిర్వహించారు. పట్టణంలో దఫేదారు నూతిసెంటర్, వైఎస్ ఆర్ నగర్ తదితర కూడళ్ల నుంచి గణపతి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనంచేశారు. మండలంలో పలు గ్రామాల్లో వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు వేడుకగా జరిపారు. ద్రాక్షారామలో సాక్షివారి వీధి, బుర్రావీధి, మార్కెట్ సెంటర్ తదితర పందిళ్ల నుంచి వినాయకుని విగ్ర హాలను మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

మండపేట: తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథులను సోమవారం కాల్వల్లో నిమజ్జనం చేశారు. మండపేట పెద్దకాల్వ వంతెన వద్ద, తాపేశ్వరం పంటకాల్వ, వెలగతోడు, ద్వారపూడి, కేశవరం, జెడ్.మేడపాడు తదితర ప్రాంతాల్లో పంట కాల్వల వద్ద వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. తొలుత నవరాత్రులు ముగింపు సందర్భంగా గణనాథుల శోభాయాత్ర బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సాగింది. గణనాథులకు వీడ్కోలు పలికి కాల్వల్లో నిమజ్జనం చేశారు. రేవుల వద్ద ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆత్రేయపురం: కట్టుంగ, ఉచ్చిలి గ్రామాల్లో పుష్పాలతో అలంకరించిన వాహనాల్లో వినాయకుడి ఊరే గింపు కన్నుల పండువగాసాగింది. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో గణపతి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకుని వెళ్లి నదుల్లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు చేశారు.

అల్లవరం: అల్లవరం, డి.రావులపాలెం, మొగళ్ళమూరి, కొమరగిరిపట్నం, బెండమూర్లంక, కోడూరుపాడు, దేవగుప్తం తదితర గ్రామాల్లో బాణసంచాకాల్చుతో గణనాథులను ఊరేగించి నిమజ్జనంచేశారు. ఆకుల లక్ష్మణరావు, రాయుడు విష్ణుమూర్తులు, అల్లూరి గోపాలకృష్ణంరాజు, అల్లూరి తిరుపతిరాజు, కాంగ్రేగుల పెద్దాబ్బాయి పాల్గొన్నారు. గణపతి ఆల యాలు, పందిళ్ల వద్ద అన్నసమారాధనలకు భక్తులు పోటెత్తారు.

కపిలేశ్వరపురం: అంగర, టేకి, కపిలేశ్వరపురం, పడమరఖండ్రిక నల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాల నుంచి గణనాథులను భాజాభజంత్రీలు, విచిత్రవేషాలు, బాణసంచా నడుమ ఊరేగింపుగా కపిలేశ్వరపురం గౌతమీ నది ఒడ్డుకు తీసుకువచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి అనంతరం నదిలో గణపతిబప్ప మోరియా అంటూ నిమజ్జనం చేశారు. అంగర ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలోబందోబస్తు నిర్వహించారు. గ్రామకార్యదర్శి కె.శివచక్రవర్తి నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. నది ఒడ్డున భక్తులకు ప్రసాద్ వితరణ చేశారు.

కె.గంగవరం: కోటిపల్లి గోదావరి నదిలో గణపతి విగ్రహాల నిమజ్జనం సోమవారం పండగలా నిర్వహించారు. పామర్రు ఎస్ఐ కె.జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. గోదావరి వరద ఉధృతి కారణంగా పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రదేశాల్లో గణనాథుల నిమజ్జనాలు చేశారు. రేవులో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 125గణపతి విగ్రహాలను నిమజ్జనంచేశారు. స్నానాలు నదిలో కాకుండా ఒడ్డున ఉన్న జల్లు స్నానంలో చేసేందుకు ఏర్పాటుచేశారు. కోటిపల్లిలో గణపతి విగ్రహాలు నిమజ్జనం కోసం వచ్చిన భక్తులకు సుభాష్ సేవా సమితి సభ్యులు మజ్జిగ వితరణ చేశారు. దీనిని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిం చారు. కొన్నిగ్రామాల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

రాజోలు: రాజోలు వశిష్ఠ గోదావరిలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం మండలాల నుంచి సుమారు 120గణేష్ విగ్రహాలు ట్రాక్టర్లపై బాణసంచా కాల్పులతో వివిధ ప్రదర్శనలతో భారీ ఊరేగింపుగా రాజోలు కాటన్ పార్కు, బైపాస్ రోడ్డు మీదుగా కనకదుర్గమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. రాజోలు కనకదుర్గమ్మ ఆలయం వద్ద గణేష్ నిమజ్జన ఉత్సవాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరికాయ కొట్టి హారతి ఇచ్చి ప్రారంభించారు. అనంతరం బి.సావరం వంతెన మీదుగా పాత ఆంధ్రా బ్యాంకు, పాత లైబ్రరీ మీదుగా సాయిబాబా గుడి, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా పాత బస్టాండు ఎదురుగా ఉన్న గొల్లపల్లి వారధి మీదుగా రాజోలు ఏటిగట్టుకు భారీ గణేష్ విగ్రహాలు ట్రాక్టర్లపై చేరుకున్నాయి. రాజోలు వశిష్ఠ గోదావరిలో భారీ విగ్రహాలను గణపతి బొప్పా మోరియా.. అంటూ భక్తులు నిమజ్జనాలు చేశారు. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో 67మందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు, తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, తాలూకా గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పామర్తి రమణ, సర్పంచ్ రేవు జ్యోతి, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, సూరిశెట్టి శ్రీనివాస్, రాజాకుమార్, కాసు శ్రీను, దారపురెడ్డి బాబ్జి, మహాపాత్రు సుభద్ధి పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో గణనాథులకు మేళతాళాలు, తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. గౌతమి, వశిష్ఠ గోదావరి నదీపాయల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



మండపేటలో ముస్లింల ప్రదర్శన

మామిడికుదురు, సెప్టెంబరు 16: ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలను మామిడికుదురులో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జయంత్యుత్సవరం సందర్భంగా మామిడికుదురులోని సున్నీ జామియా మసీదులో మిలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు తమ కవితల ద్వారా మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. మత ప్రబోధకుడు సాధిక్‌అన్వర్ రజ్వీ మాట్లాడుతూ ఇస్లాం వనంలో వికసించిన అత్యున్నత మహనీయుడు మహ్మద్ ప్రవక్త అని వివరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్ (బాజానీ) ఆధ్వర్యంలో హైవేపై వెళ్లే వాహనదారులు, పాదచారులకు, ప్రయాణికులకు చల్లటి పానీయాన్ని అందించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, అన్వర్ తాహిర్ హుస్సేన్, షేక్ కరీముల్లా, నూరేన్‌అబ్బాస్, కిశ్వర్ మొహిద్దీన్, సయ్యద్ రూహీ, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ర్యాలి, కట్టుంగ, బొబ్బర్లంక తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త జన్మదినాన్ని భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు.

మండపేట: ప్రవక్త చూపిన మార్గంలో ముస్లింలు నడుచుకోవాలని మండపేట జామీయా మసీదు ఈమామ్ గులాం మొహ్మద్ ముర్షిద్ రజ్వీ అన్నారు. మండపేటలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించారు. స్థానిక మసీదు నుంచి ముస్లింలో పట్టణంలో శాంతి ర్యాలీ చేశారు.

అల్లవరం: అల్లవరంమదీనా మసీదులో ఇమాంఅబుల్ సమడ్ ఖురాన్ పఠించగా మిలాద్-ఉన్-నబి ప్రార్థనలు చేశారు. షేక్ రహ్మాన్, జహంఘీర్, మస్తాన్, షేక్ వలీపాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణం, ద్రాక్షారామలో సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉల్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం, ద్రాక్షారామలో ముస్లింలు నిర్వహించిన జల్సా (ఊరేగింపు)లో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ద్రాక్షారామలో మత గురువులు గులాముస్తాఫా, అస్కరి మౌలానా సతక్ హుస్సేన్, ముస్లింలు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక అంజుమనే ఇందాదుల్ ముస్లీమీన్ మసీదులో మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జీవిత కథలు బోధించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి పేదలకు సాయం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కరీముల్లా, ఇబ్రహీం, సురాజ్, కరీం, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రాయవరం: వెదురుపాక మసీదులో మిలాద్ - ఉన్-నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను శుక్రవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదు నిర్వాహకుడు అహ్మద్ బాషా ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ ఆఫీద్ మహ్మద్ అబూ బక్కర్ అబీబీ ఖురాన్‌ను పఠించి మహమ్మద్ ప్రవక్త జన్మ వృత్తాంతాన్ని వివరించారు. సయ్యద్ బాషా, ఖాజా బాబు, మహమ్మద్ బాషా, షేక్ బాబ్జి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వలీబాబా దర్గాలో దీపారాధన



దర్గా వద్ద దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు

ముమ్మిడివరం, సెప్టెంబరు 16: కొత్తలంకలోని వలీబాబా దర్గా వద్ద ఉరుసు మహోత్సవాల్లో భాగంగా సోమవారం దీపారాధన కార్యక్రమాన్ని హిందూ-ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే బాబాకు ప్రత్యేక పూజలు జరిపించి కరాచీ నూకతో తయారుచేసినప్రసాదాన్ని సమర్పించారు. సాయంత్రం దర్గానంతా దీపాలతో అలంకరించి పూజలు జరిపించారు. రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ-ముస్లిం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి బాబా దర్గాను దర్శించుకుని వారి మతాచారాల ప్రకారం పూజలు జరిపించారు. ముజావర్ ఆలీబాబా కమిటీ సభ్యులు గేదెల రఘునాథబాబు, నూకల శివ, గేదెల ఉదయభాస్కర్‌ల ఆధ్వర్యంలో దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వసతి, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

యానాం గోదావరిలో గణపతి తెప్పోత్సవం



యానాం, సెప్టెంబరు 16: స్థానిక రాజీవ్‌గాంధీ బీచ్‌లోని భారతమత విగ్రహం సమీపంలోని జెట్టి వద్ద సోమవారం గణనాథులను నిమజ్జనం చేశారు. యానాం నియోజకవర్గలోని వివిధ ప్రాంతాకు చెందిన గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లు, వివిధవాహనాలపై మేళతాళాలు, నృత్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. విగ్రహాలను మేళతాళాలు, నృత్యలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. పోలీసుల భారీ బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది విగ్రహాలను ట్రాలీపై తీసుకువెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు.

గోదావరిలో తెప్పోత్సవం: స్థానిక పిల్లారాయవీధిలో కొలువైన శ్రీపిళ్ళైయ్యార్‌స్వామి (లక్ష్మిగణపతి) ఆలయంలో గణపతి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. చివరిరోజు సోమవారం స్వామివారి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం యానాం అగ్నికులక్షత్రియ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌతమి గోదారిలో పడవపైప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వ హించారు. సంఘ ప్రతినిధులు మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం

యానాం, సెప్టెంబరు 16: శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా స్థానిక పడవలరేవు వీధిలోని వేంచేసియున్న శ్రీలలితాదేవి ఆలయం వద్ద శ్రీలలిత భక్తమండలి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.48గంటలకు సోమవారం రాట ముహూర్తం నిర్వహించారు. అక్టోబరు3న ఉదయం 9.36గంటలకు కలశస్థాపనతో దేవి నవరాత్రులు ప్రారంభంకానున్నాయి. కార్యక్రమంలో భక్తమండలి అధ్యక్షుడు మట్టా సత్యవెంకట సుబ్రహ్మణ్యం, చింతలపూడి రాంపండు, బేతాళం కుమార్, బేతాళం నాగేశ్వరరావు, సత్యవరపు నూకరాజు, కాశే సుధాకర్, మండా రాము, శేరు గణేష్ పాల్గొన్నారు.

ప్రపంచ ఓజోన్ దినోత్సవం

కొత్తపేట, సెప్టెంబరు 16: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, డాక్టర్ సీహెచ్ పాపారావు, డాక్టర్ కె.అంకమరావు, టీహెచ్ నాగరాణి, నాగదీపిక, విజయకుమార్, హేమలత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.50వేలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 16: ద్రాక్షారామ పీవీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో దసరా సందర్భంగా నిర్వహించే క్రికెట్ టోర్నీ విజేతకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.50వేలు ప్రైజ్‌మనీ ఇస్తానని మంత్రి సుభాష్ ప్రకటించారు. సోమవారం క్రీడా ప్రాంగణం అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో అందరితో సమావేశం నిర్వహించి పీవీఆర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి లేదా జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్వహించేలా అన్న విషయాలు తేలుస్తామన్నారు. ఉన్నత పాఠశాల విధి విధానాలు, జరిగిన పరిమాణాలను న్యాయవాది మాగాపు అమ్మిరాజు వివవరించారు. కార్యక్రమంలో డా. రాంబాబు, ముప్పనపల్లి గణేష్, పెంకే సాంబశివరావు పాల్గొన్నారు.

శెట్టిబలిజ మండపం అభివృద్ధి పనుల ప్రారంభం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 16: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ కల్యాణ మండం అభివృద్ధి పనులను మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు.మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శెట్టిబలిజ సంఘ నాయకులు దొంగల శ్రీధర్, పలివెల వెంకటరమణ, గుత్తుల వీరన్నశెట్టి, పలివెల నాగరాజు, పలివెల వెంకట రమణ, బొక్కా సత్యనారాయణ, కట్టానాగేశ్వరావు పాల్గొన్నారు.

సీతారామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారామ్ మృతి దేశ ప్రజలకే కాదు ప్రపంచ కమ్యూనిస్టు లోకానికి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంధ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. సీతారామ్ గొప్ప కమ్యూనిస్టుగానే కాకుండా మంచి పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన తెలుగు వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో ఏచూరి సంస్మరణ సభను సోమవారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏచూరి జీవితంలో చేసిన పోరాటాలు, ఉద్యమాలను వివరించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా శాఖల నాయకులు ఎస్.జ్యోతిబసు, పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, టి.నాగవరలక్ష్మి, రత్నకుమారి, పార్వతి, పి.అమూల్యా తదితరులు పాల్గొన్నారు.

18,20 తేదీల్లో క్రీడా పోటీలకు ఎంపికలు

కపిలేశ్వరపురం,సెప్టెంబరు16: కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18న బాలురకు, 20న బాలికలకు ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలకు అండర్ -14,17 విభాగాల్లో బాలురు, బాలికలకు కోకో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌కు ఎంపికలు జరుగుతాయని ఎంఈవో కె. తాతారావు హెచ్‌ఎం వి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఎంఆర్సీ భవనంలోనిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, మండల రవికుమార్, బేగం పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50వేలు సాయం

మండపేట, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితుల కోసం మండపేటకు చెందిన వైష్ణవి విద్యా సంస్థ నిర్వాహకుడు కోనే వీర్రాజు రూ.50వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అందజేశారు. మండపేటకు చెందిన వైద్యుడు పాలడుగు చంద్రమౌళి రూ.10వేలు, కపిలేశ్వరపురం మండలం మాచరకు చెందిన అడపా రామకృష్ణ రూ.5వేలను స్థానిక పార్టీ కార్యాలయంలో వేగుళ్లకు అందజేశారు.

ఏరియా ఆసుపత్రికి దుప్పట్లు అందజేత

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు16: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ 300దుప్పట్లను అందజేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు ప్రవీణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బొజ్జా తారకం వర్ధంతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 16: సీనియర్ న్యాయవాది పోరాటయోధుడు, కవి, రచయిత బొజ్జా తారకం ఎనిమిదవ వర్ధంతిని ముమ్మిడివరంలో నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మచెరువు గట్టు వద్దనున్న తారకం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బుద్ధ పార్కు ఆవరణలో బి.శరత్ అధ్యక్షతన జరిగిన తారకం వర్ధంతి కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నాయకులు పెనుమాల సుధీర్, పెనుమాల చిట్టిబాబు, వడ్డి నాగేశ్వరరావు, కాశి సింహాద్రివర్మ, మట్టా వెంకట్రావు, చిరంజీవి మాష్టారు, నేలపూడి రామకృష్ణ, సకిలే పృధ్వీరాజ్, నల్లా ప్రకాశ్, నందికి ధనరాజు, గిడ్ల రమేష్, మేకల మీరాసాహెబ్, యలమంచిలి సురేష్, సామంతకుర్తి శంకర్, జనచైతన్య మండలివ్యవస్థాపక అధ్యక్షుడు పెయ్యల పవన్‌ప్రసాద్‌లతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు, మహిళలు పాల్గొని నివాళులర్పించారు.

అమలాపురం టౌన్: అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం బొజ్జా తారకం ఎనిమిదో వర్ధంతి సభను బొంతు రమణ అధ్యక్షతన నిర్వహించారు. దళిత అణగారిన వర్గాలల కోసం జీవిత కాలం పోరాటం చేసిన మహనీయుడిగా తారకం చరిత్రలో నిలిచిపోతారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు పేర్కొన్నారు. తారకం చిత్రపటానికి నివాళులర్పించారు. ఐఎస్‌మల్లేశ్వరరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్, అమలదాసు బాబూరావు, జల్లి శ్రీనివాస్, కొండా దుర్గారావు, గిడ్ల వెంకటేశ్వరరావు, శెట్టిబత్తుల తులసీరావు, మెండి డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

కొబ్బరి పీచు బొమ్మల తయారీపై శిక్షణ

మామిడికుదురు, సెప్టెంబరు 16: రాజమహేంద్రవరం ఓఎన్జీసీ వారి సహకారంతో క్విజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి పీచు బొమ్మల తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం పాశర్లపూడిలో ప్రారంభించారు. ఒడిసా రాష్ట్రం నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ 30మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు. మహిళలు జీవనోపాధి పొందే విధంగా కృషిచేస్తామని ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధర్ తెలిపారు.

టీడీపీ నాయకుడికి సతీ వియోగం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 16: ఉప్పలగుప్తం మాజీ ఎంపీటీసీ, చీకట్లపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పోలిశెట్టి భాస్కరరావు సతీమణి శాంతకుమారి (68) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, రవణం మధు, పెయ్యల దుర్గారావు సంతాపం తెలిపారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

అంబాజీపేట, సెప్టెంబరు 16: స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్‌లో హాలులో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయనం విభాగం ఆధ్వర్యంలో 96వ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి రాష్ట్ర వేదాధ్యయన విభాగ సమన్వయం కర్త కొఠారి హరిప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో 40మంది వేదపండితులు నమక, చమకాలు, వేదాధ్యయనం గావించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. కోనసీమ, కాకినాడ జిల్లాల అధ్యక్షులు అడబాల కొండబాబు, వై.గోవిందరాజులు, జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్, ఆర్.నారాయణరావు, అడపా రాంబాబు, సేవ రాంబాబు, నెక్కంటి లక్ష్మి, అరుణాదేవి, శిష్టా గుణరంజన్, భవాని, సుబ్బారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపేట ఏఎంసీ కార్యదర్శి యశ్వంతరావు మృతి



రావులపాలెం, సెప్టెంబరు 16: కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి యశ్వంతరావు(57) గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. తిరుపతి జిల్లాకు చెందిన ఆయన 2022లో కొత్తపేట ఏఎంసీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భౌతికకాయాన్ని మార్కెటింగ్ శాఖ రీజనల్ డైరెక్టర్ పి.సుధాకర్, మార్కెటింగ్‌శాఖజిల్లా అధికారి కె.విశాలాక్షి, ఏఎంసీ సిబ్బంది, రావులపాలెంమార్కెట్ యార్డు సిబ్బంది, వ్యాపారులు సందర్శించి సంతాపం తెలిపారు.

వేలంలో భారీగా ధర పలికిన గణనాథుల లడ్డూలు

మామిడికుదురు, సెప్టెంబరు 16: మామిడికుదురు శివారు చేరీ తోటలోని శ్రీకోదండ రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద ఉంచిన లడ్డూకు సోమవారం వేలం పాట నిర్వహించారు. 19కిలోల లడ్డూను గ్రామానికి చెందిన కాంగ్రేగుల నిఖిల్ సత్యశ్రీనివాస్ రూ.75వేలకు దక్కించుకున్నాడు. లడ్డూను ఊరేగింపుగా తీసుకువెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. గాలిదేవరపాలెంలోని 5కిలోల లడ్డూను గ్రామానికి చెందిన గాలిదేవర సూరిబాబు వేలం పాటలో దక్కించుకున్నాడు.

అల్లవరం: కొమరగిరిపట్నంలో గణనాథుని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, దెందుకూరి సత్తిబాబురాజు, మంతెన సురేష్‌రాజు దర్శించుకున్నారు. అల్లవరం పొలంలో సిద్ధివినాయకుడి పందిరిలో 18కిలోల లడ్డూను కాంగ్రేగుల వెంకటేశ్వరరావు, నరసింహరావు కుటుంబ సభ్యులు రూ.1.85లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. మొగళ్లమూరులో గణపతి లడ్డూను తోటకూర సత్యనారాయణరాజు రూ.54,999కి, డి.రావులపాలెంలో లడ్డూను సూరిశెట్టి నరసింహరావు రూ.20వేలకి దక్కించుకున్నారు.

కపిలేశ్వరపురం: అంగరలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పది కిలోల ఆది గణపతి లడ్డూను సోమవారం యానాల సీతారామయ్య కుమారులు రూ.3వేలకు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆది గణపతి ఆలయ చైర్మన్ పెద్దింశెట్టి సూరిబాబు, చీకట్ల గంగరాజు, ఎర్ర సుబ్బారావు, సుంకర బుజ్జి, మేడేపల్లి శ్రీను, యానాల వీర్రాఘవులు, మేడేపల్లి కొండ, సుబ్బారావు, రామ్, లక్ష్మణ్, తోరాటి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మండలంలోని గ్రామాల్లో గణనాథులను నదులు, కౌశిక్ ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. గంగలకుర్రు మలుపు వద్ద విజయ గణపతి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఇక్కడ స్వామివారి లడ్డును మొల్లేటి సంతోష్ రూ.24వేలకు దక్కించుకున్నాడు. గుంటమామిడితోటలో స్వామివారి లడ్డును శ్రీపాద సత్యనారాయణమూర్తి రూ.12,500కు దక్కించుకున్నాడు.

అమలాపురం టౌన్: ఇందుపల్లి అరవగరువు శ్రీబాలభక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో లడ్డూలకు సోమవారం వేలం పాట నిర్వహించారు. ఒక లడ్డూను శిష్టా సుందరరామయ్య-శేషకుమారి దంపతులు రూ.29,500కు, మరో లడ్డూను పేరి రామకృష్ణ-ఫణికుమారి దంపతులు రూ.23,500కు దక్కించుకున్నారు. గణేశ నిమజ్జనంలో సంఘ ప్రతినిధులు టీకే విశ్వనాథ్, శిష్టా భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: సోమవారం స్థానిక మావుళ్ళమ్మ గుడి ఆలయ ప్రాంగణంలోని సిద్ధివినాయక లడ్డూ ప్రసాదాన్ని గుత్తుల శ్రీనివాస్ రూ.9వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయక ప్రతిమను మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో పల్లంకుర్రు వృద్ధగౌతమిలో నిమజ్జనం చేశారు.ఆణివిళ్ళ సాయిబాబా, ఆకొండి శంకరశాస్త్రి, ఫణికాంత్, గ్రంధి రాంప్రసాద్, సుంకర పవిత్ర, వేదుల శ్రీనివాస్, విత్తనాల పండు, కస్నిడి బాబ్జి పాల్గొన్నారు.

అంతర్వేది: అంతర్వేది వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో వినాయకుడికి గరిక పూజ నిర్వహించారు. విద్యార్థులు, భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన , ప్రత్యేక భక్తి గీతాలాపనల పోటీలు నిర్వహించారు. మండలంలో పలుచోట్ల వినాయకుని మండపాల పూజలు చేశారు.

ముమ్మిడివరం: ఠాణేలంక పంచాయతీ వరగల్లంకలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామాయణం వెంకటేశ్వరరావు 54కిలోల లడ్డూను స్వామివారికి కానుకగా సమర్పించారు. ఆ లడ్డూకు సోమవారం నిర్వహించిన వేలంలో కోలా లక్ష్మణస్వామి రూ.30వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో రామాయణం బాబూరావు, రామాయణంమనేశ్వరరావు, నూకల మణి, నూకల రాములతో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



మండపేట, సెప్టెంబరు16: జాతీయస్థాయి అండర్-14 టెన్నికాయిట్ పోటీలకు మండపేటకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. వేగుళ్ల సూర్యారావు పాఠశాలకు చెందిన విద్యార్థులకు కోచ్ కుంచే రమేష్ ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈనెల30న జమ్ము కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు పాల్గొంటారు.

టీడీపీ సీనియర్ నాయకుడు శంకరరావు మృతి



మామిడికుదురు, సెప్టెంబరు 16: మామిడికుదురుకు చెందినటీడీపీ సీనియర్‌నాయకుడు వాసంశెట్టి శంకరరావు (65) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయన టీడీపీలో పలు పదవులు నిర్వహించారు. శెట్టిబలిజ సంఘ నాయకుడిగా శెట్టిబలిజల అభ్యున్నతికి కృషిచేశారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ శాంతి కమిటీ సభ్యుడిగా, కోనసీమవృత్తికళాకారుల సంక్షేమసంఘ కార్యదర్శిగా, బాలబాలాజీ దేవస్థానం సభ్యుడిగా, టైలర్ల సంఘ మండల గౌరవాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతికి సంతాపంగా మండలంలోని టైలర్లు షాపులను మూసివేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భార్య కనకదుర్గ మామిడికుదురు ఎంపీటీసీగా పనిచేశారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, టీడీపీ నాయకలు, వృత్తి కళాకారులు, టైలర్లు శంకరరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అశ్లీల నృత్యాల ప్రదర్శనపై కేసులు నమోదు

మామిడికుదురు, సెప్టెంబరు16: పెదపట్నంలంకలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా అశ్లీల నృత్యాలు ప్రదర్శించడంపై కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. వినాయకుని ఊరేగింపులో భాగంగా అశ్లీల నృత్యాలను ప్రదర్శించడంతో కమిటీ సభ్యులపై కేసు నమోదుచేసి ట్రాక్టరును, డీజేసౌండ్‌బాక్సులను సీజ్ చేసినట్టు తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ: ముగ్గురికి గాయాలు

కొత్తపేట, సెప్టెంబరు 16: పలివెల సంత మార్కెట్ చప్పిడివారిపాలెం గణేష్ నిమజ్జన ఊరేగింపులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఊరేగింపు జరుగుతుండగా డీజేలో వేసిన ఓ పాట విషయమై ఏర్పడిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. పలివెలకు చెందిన చొల్లంగి గోవిందు, అతని కుమారులు గణేష్, సుబ్రహ్మణ్యంలపై అదే గ్రామానికి చెందిన చప్పిడి ప్రకాష్, చప్పిడి ఏసు, చప్పిడి కృష్ణ ఘర్షణకు దిగి కర్రతో దాడి చేశారు. బాధితులను కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువర్గాలతోను గ్రామ పెద్దలు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కె.గంగవరం, సెప్టెంబరు16: పామర్రు పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సోమ వారం తెల్లవారుజామున సత్యవాడ నుంచి పాణింగపల్లి వైపు వస్తున్న వాహ నాన్ని తనిఖీ చేయడానికి ఆపారు. దీంతో డ్రైవరు వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. వాహనంలో ఉన్న 600కిలోల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పామర్రు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైల్
శ్రీలలిత	: భలే ఉన్నాడే
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: 35
రమా	: మత్తువదలరా-2
గణపతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏఆర్‌ఎం